క్లుప్తంగా

ముగిసిన వ్యాసరచన పోటీలు

పెదకూరపాడు: కవి బ్రహ్మ ఏటుకూరి వెంకట నరసయ్య వర్ధంతి సందర్భంగా మంగళవారం వ్యాసరచన పోటీలు జరిగాయని పెదకూరపాడు అభివృద్ధి వేదిక కన్వీనర్, ప్రజాకవి దర్శి శేషారావు తెలిపారు. పెదకూరపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీలకు పలు పాఠశాలల నుంచి 80 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. త్వరలో ఫలితాలు ప్రకటించి విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమ నిర్వహణలో పెదకూరపాడు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం కేవీ రమణ, ఉపాధ్యాయులు, పీడీఎఫ్ సభ్యులు కె.ప్రదీప్ కుమార్, మస్తాన్‌రావు, జానీ బాషా పాల్గొన్నారు.

బ్యాంకింగ్ వ్యవస్థపై విద్యార్థులకు అవగాహన



అచ్చంపేట: విద్యార్థులు చదువుతోపాటు భవిష్యత్‌లో ఉపయోగపడే వృత్తి విద్యలలో కూడా నైపుణ్యం సాధించాలని స్థానిక ఎంపీ సాంఘిక సంక్షేమ బాలురు గురుకుల పాఠశాల/కళాశాల ఉపాధ్యాయులు కట్టా శివన్నారాయణ తెలిపారు. 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులను మంగళవారం ఆయన స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు తీసుకెళ్లారు. బ్యాంకింగ్ వ్యవస్థ పనితీరు, ఖాతాదారులు, పొదుపు సంఘాలు సభ్యుల లావాదేవీలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బ్యాంకు మేనేజరు జయభారతి బ్యాంకింగ్, డిజిటల్ సేవలపై అవగాహన కల్పించారు. పాఠశాల ప్రిన్సిపాల్ టి.అరుణ్‌కుమార్, ఉపాధ్యాయులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు



నకరికల్లు: అధీకృత డీలర్ వద్ద మాత్రమే ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేయాలని ఏవో కె.దేవదాసు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎరువులు, పురుగు మందుల డీలర్‌లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కొనుగోలు చేసిన రైతులకు ఇచ్చే బిల్లుల్లో అమ్మకందారుని, కొనుగోలు దారుని సంతకం, లాట్ నంబర్ పొందుపరిచి ఉండాలన్నారు. ఎరువులను ఎమ్మార్పీ ధరకంటే ఎక్కువగా విక్రయిస్తే దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పలు గ్రామాల డీలర్‌లు పాల్గొన్నారు. అలాగే రూపెనగుంట్ల, తురకపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి పైరు బిర్రు పొట్ట దశలో సోకే తెగుళ్లను సకాలంలో గుర్తించి కాపాడుకోవాలని, ఆకుచుట్టు పురుగు కన్పిస్తుందని సత్వరమే నివారణ చర్యలు చేపట్టాలని ఏవో కె.దేవదాసు సూచించారు. ఎంపీటీసీ కె.హనుమంతరావు, రైతులు పాల్గొన్నారు.

నేడు, రేపు అధికారులు, ప్రజా ప్రతినిధులకు శిక్షణ


రాజుపాలెం: మండల పరిషత్ కార్యాలయంలో 13, 14 తేదీలలో గ్రామాల అభివృద్ధి ప్రణాళికపై మండల స్థాయి అధికారులకు, ప్రజా ప్రతినిధులకు రెండు రోజుల పాటు శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జీవీ సత్యనారాయణ మంగళవారం తెలిపారు. శిక్షణకు సచివాలయాల అధికారులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తప్పక హాజరువాలని కోరారు.

అన్నదాతలపై కాలకూటమి

ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందే రైతు భరోసా పేరిట పెట్టుబడి సాయం అందేది. అలాగే పంటలు నష్టపోతే సకాలంలో నష్ట పరిహారం అందేది. రైతులకు పెట్టుబడి సాయాన్ని రూ.20 వేలకు పెంచుతామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వంలోని పథకాలకు పేర్లు మార్చడానికే పరిమితమయ్యింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు దాటింది. వ్యసాయ సీజన్ ప్రారంభమైనా.. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా కనీసం పెట్టుబడి సాయం అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమయింది. దీంతో రైతులు ముఖ్యంగా కౌలు రైతులు చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

పెరుగుతున్న కౌలు రైతుల ఆత్మహత్యలు

- మండలంలో నెల రోజుల వ్యవధిలో ముగ్గురు కౌలు రైతులు దుర్మరణం
- పెట్టుబడి సాయం రూ.20 వేలు ఎన్నికల హామీ ఊసెత్తని ప్రభుత్వం
- భారీ వర్షాలకు పంట నష్టపోయినా అందని పరిహారం
- నష్టాలను తట్టుకోలేక, ప్రభుత్వ సాయం అందక ఆత్మహత్యలు చేసుకుంటున్న కౌలు రైతులు



అచ్చంపేట: ఆరుగాలం, ఇంటిల్లి పాది కష్టపడి పండించిన పంటలకు ధరలు నిర్ణయించే అధికారం మాత్రం రైతులకు లేదు. ప్రస్తుత ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలమైంది. ప్రకృతి విపత్తులకు పంటలు కోల్పోయిన రైతులకు పరిహారానికి ఎగనామం పెట్టారు. ఎన్నికల హామీలలో కౌలు రైతులతో సహా భూములున్న ప్రతి రైతుకు రైతు భరోసాగా ఇస్తామన్న రూ.20 వేలు విషయంపై ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. ఎరువులు, పురుగు మందులపై సబ్సిడీ ఎత్తేశారు. బీమా గురించి పట్టించుకోవడం లేదు. రైతన్నలకు మేమున్నామని భరోసా ఇచ్చే నాథుడే కరువైనాడు. ప్రకృతి విలయ తాండవానికి పంటలు కోల్పోయి, బ్యాంకులు, సహకార సంఘాలు, ఎరువులు, పురుగు మందుల షాపులు, బంధువులు, స్నేహితుల వద్ద చేసిన అప్పులు తీర్చే మార్గం లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

నియోజకవర్గంలో ఆరుగురు కౌలు రైతులు

పెదకూరపాడు నియోజకవర్గంలో మూడు నెలల వ్యవధిలో ఆరుగురు కౌలు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. అచ్చంపేట మండలంలో దాదాపు నెల రోజుల వ్యవధిలో ముగ్గురు కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. అమరావతి మండలంలో ఇద్దరు, క్రోసూరు మండలంలో ఒక్కరు అప్పుల బాధలు తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకున్నారు.



తుమ్మా చిన్నపరెడ్డి (తాళ్లచెరువు)



వెంకటేశ్వర్లు నాయక్ (కొండూరు)



హనుమాన్‌నాయక్ (గింజుపల్లి)

- అచ్చంపేట మండలంలో అక్టోబరు 9న తాళ్లచెరువుకు చెందిన తుమ్మా చిన్నపరెడ్డి తన పత్తి పొలంలో పురుగుల మందు తాగి ప్రాణాలు కోల్పోయాడు.
- అక్టోబరు 17న కొండూరుకు చెందిన కేతావతు వెంకటేశ్వర్లు నాయక్ కూడా చేసిన అప్పులు తీర్చలేక, కొత్త అప్పులు పుట్టక, వేసిన పత్తి వర్షార్పణం కావడంతో పొలంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.
- నవంబరు 3న గింజపల్లికి చెందిన బాణావత్ హనుమాన్ నాయక్ చేసిన రూ.15 లక్షలు అప్పు తీర్చలేక, వర్షానికి కొట్టుకుపోయిన పత్తి పంటకు పరిహారం రాక, ప్రతి ఏటా వచ్చే రైతు భరోసా అందకపోవడంతో గేదెలపాకలో దూలానికి ఉరేసుకుని మృతి చెందాడు.
- వీరెవరికీ పంట నష్ట పరిహారం గానీ, పెట్టుబడి సాయం గానీ ప్రభుత్వం నుంచి రాలేదు. ఇంటి యజమానిని కోల్పోవడంతో కుటుంబాలు వీధుల పాలయ్యాయి. రైతులు ఆత్మహత్యలు చేసుకున్నా పాలకులకు చీమకుట్టినట్లయినా లేకపోవడం గమనార్హం.

ఆత్మహత్యల నివారణకే వైఎస్సార్ రైతు భరోసా

రైతులు, కౌలు రైతుల ఆత్మహత్యలు నివారించేందుకే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని 2019, ఫిబ్రవరి 15న ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా గత ఐదు సంవత్సరాల పాటు వ్యవసాయ సీజన్ ప్రారంభంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.7500, కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.6000 రైతు ఖాతాకు జమ అయ్యేవి. ఈ మొత్తం రైతుకు అరకలు దున్నుకునేందుకు, విత్తనాలు కొనుగోలు చేసుకునేందుకు పెట్టుబడి సాయంగా ఉపయోగపడేవి. ఈ మొత్తాన్ని రూ.20 వేలు చేస్తానంటూ చంద్రబాబు ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడి ఇప్పటికి నాలుగు నెలలు దాటినా హామీల ఊసెత్తకపోవడంతో రైతులు తీవ్ర నిరాశతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

రైతులకు అందని తుఫాన్ పరిహారం

ఇటీవల 15 రోజుల వ్యవధిలో సంభవించిన రెండు తుఫాన్‌ల ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు మండలంలో సుమారు 2 వేల హెక్టార్లలో పత్తి నష్టపోవడం జరిగింది. ప్రభుత్వం విధించిన షరతుల వల్ల చాలా మంది రైతులకు పంట నష్ట పరిహారం అందలేదు. పరిహారం రాకపోవడం కూడా రైతుల ఆత్మహత్యలకు ఒక కారణంగా చెప్పవచ్చు. రైతుల ప్రభుత్వం అని చెప్పుకునే టీడీపీ హామీలను తక్షణమే నెరవేర్చి పంటలకు కనీస గిట్టుబాటు ధర కల్పించి ఆత్మహత్యలను కొంతవరకైనా నివారించాలని రైతులు కోరుతున్నారు.

వ్యాసరచన పోటీల్లో బ్లూబెల్స్ హైస్కూలు విద్యార్థి ప్రతిభ



అచ్చంపేట: శ్రీ సత్యసాయి సేవ సంస్థలు, ఆంధ్రప్రదేశ్ నిర్వహించిన వ్యాసరచన పోటీలలో స్థానిక బ్లూబెల్స్ హైస్కూలు విద్యార్థి పెద్దింటి సైదేశ్వరరావు జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించినట్లు సంస్థ మండల శాఖ అధ్యక్షులు తిమ్మిశెట్టి రాంబాబు తెలిపారు. విద్యార్థిని అభినందిస్తూ సంస్థ సభ్యులు షీల్డ్‌తో పాటు ప్రశంసాపత్రాన్ని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ విద్యార్థులలో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు తమ సంస్థ ఆధ్వర్యంలో గత నెల అక్టోబరు 17న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించామన్నారు. మండలంలో వివిధ పాఠశాలల నుంచి 180 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. వీరిలో బ్లూబెల్స్ హైస్కూలుకు చెందిన సైదేశ్వరరావు జిల్లా స్థాయిలో రెండవ బహుమతిని సాధించినట్లు చెప్పారు. సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బేస్‌బాల్ జట్టుకు ఎంపికైన మబిన్



అమరావతి: పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా నిర్వహించిన పోటీలలో అండర్–17 రాష్ట్ర స్థాయి జట్టుకు స్థానిక శ్రీరామకృష్ణా హిందూ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న పి.మబిన్ ఎంపికయ్యాడు. గుంటూరు జిల్లా యనమదలలో 9, 10, 11 తేదీలలో నిర్వహించిన అండర్–17 బేస్‌బాల్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. మంగళవారం మబిన్‌ను హెచ్ఎం మాజేటి రాము, వ్యాయామ ఉపాధ్యాయురాలు అనురాధ, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

పత్తి కనీస మద్దతు ధర క్వింటా రూ.7,521

- సత్తెనపల్లి ఇన్‌చార్జ్ వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీధర్‌రెడ్డి

సత్తెనపల్లి: కేంద్ర ప్రభుత్వం 2024–25 సీజన్‌కి పత్తి పంట కనీస మద్దతు ధర క్వింటాకు రూ.7,521 చొప్పున కొనుగోలు చేసేందుకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిందని సత్తెనపల్లి ఇన్‌చార్జ్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.శ్రీధర్‌రెడ్డి అన్నారు. సత్తెనపల్లి మండలం కంటెపూడి రైతు సేవా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఖరీఫ్ -2024 సీజన్‌లో ఈ-పంట ద్వారా నమోదు చేసుకొని ఉన్న రైతులు రైతు సేవా కేంద్రాల్లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. సీసీఐ ద్వారా పత్తి విక్రయించదలచినవారు తప్పక కొన్ని నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. రైతులు వాడుకలో ఉన్న వారి బ్యాంకు ఖాతాలను ఆధార్ నెంబర్లతో అనుసంధానం చేసుకున్న ఖాతాలల్లోనే నగదు జమ చేయటం జరుగుతుందన్నారు. శనగలు జేజీ–11రకం కేజీ రూ.70.50 రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని, రైతులు వినియోగించుకోవాలన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద పల్నాడు జిల్లాలో రబీ సీజన్‌కు వరి పంటకు ఇన్సూరెన్స్ చేయించుకొనేందుకు అవకాశం ఉందన్నారు. వరి పండించే రైతులు డిసెంబర్ 31 లోపు ఎకరానికి రూ.630 రైతు వాటా ప్రీమియం చెల్లించి ఇన్సూరెన్స్ చేయించుకోవచ్చన్నారు. ఉద్యాన శాఖ అధికారి నవీన్, టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

క్రోసూరు: సీసీఐ నాణ్యమైన పత్తి క్వింటా రూ.7,521కు కొనుగోలు చేస్తుందని ఏవో వేణుగోపాల్ అన్నారు. మండలంలోని గుడిపాడు, 88 తాళ్లూరు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రస్తుతం సాగులో ఉన్న ఖరీఫ్ పంటలైన వరి, పత్తి, మిరప పంటలలో రైతులు పాటించవలసిన మేలైన యాజమాన్య పద్ధతులు, సస్య రక్షణ చర్యలను ఆయన వివరించారు. సీసీఐ ద్వారా పత్తి క్వింటాకు కనీస మద్దతు ధర రూ.7,521 చొప్పున కొనుగోలు చేయడం జరుగుతుందని, రైతులు గ్రామాల్లోని రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించి ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. రైతు సేవా కేంద్ర సిబ్బంది మీర్ ఖాజామొహిద్దీన్, రైతులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 30 మందికి ఉద్యోగాలు

సత్తెనపల్లి: రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను రూపుమాపేందుకు రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ కృషి చేస్తుందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజీరావు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పన కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో ఆయన పాల్గొని మాట్లాడారు. జాబ్‌మేళాకు 54 మంది పాల్గొనగా 30 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన వారికి నియామక పత్రాలు అందించామన్నారు. జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కేటీటీ వెంకటరమణ మాట్లాడుతూ ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ జాబ్ మేళాను సత్తెనపల్లిలో నిర్వహించడం సంతోషకరమన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది, జిల్లా ఉద్యోగ కల్పన అధికారి ఎం.రవీంద్రనాయక్, సత్తెనపల్లి స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ రామకృష్ణారెడ్డి, మహేందర్, శ్రీకాంత్, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ప్రతినిధి శ్రీనివాస్, కంపెనీ హెచ్ఆర్ ప్రతినిధులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు


సత్తెనపల్లి: 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14 నుంచి 20 వరకు సత్తెనపల్లి శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్నట్లు సత్తెనపల్లి గ్రంథాలయ శాఖ అధికారి కొర్రపాటి వాణి మంగళవారం తెలిపారు. వారం రోజుల పాటు విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ వంటి పోటీలను నిర్వహిస్తామన్నారు. పుస్తక ప్రదర్శన, ర్యాలీ వంటి కార్యక్రమాలు నిర్వహించబడతాయన్నారు. విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని ఆమె కోరారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తున్న 11 లారీలు సీజ్



అమరావతి: మండల పరిధిలోని లేమల్లె గ్రామ సమీపంలో మంగళవారం అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న 11 లారీలపై సత్తెనపల్లి డీఎస్పీ ఎం.హనుమంతరావు ఆదేశాల మేరకు ప్రత్యేక పోలీసుల బృందం ఆకస్మికంగా దాడిచేసి సీజ్ చేశారు. మండల పరిధిలోని దిడుగు ఇసుకరీచ్ నుంచి, తుళ్లూరు మండలం బోరుపాలెం ఇసుకరీచ్ నుంచి గుంటూరుకు అక్రమంగా ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న 11 భారీ వాహనాలను పోలీసులు అదుపులోకి తీసుకుని అమరావతి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మొక్కజొన్నలో కత్తెర పురుగును రైతులు గమనించాలి



రాజుపాలెం: మొక్కజొన్నలో అక్కడక్కడ కత్తెర పురుగు ఉన్నట్లు ఏడీఏ హనుమంతరావు రైతులకు సూచించారు. మండలంలోని బలిజేపల్లి గ్రామంలోని మొక్కజొన్న పంటలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ రైతులతో మాట్లాడుతూ మొక్కజొన్న పంటలో రబీ కాలంలో ఎక్కువగా కత్తెర పురుగు ఆశిస్తుందని, నివారణకు ఎకరానికి ఒక లీటరు వేపనూనె లేదా వేపగింజల కషాయాన్ని పిచికారీ చేయాలని, నాలుగైదు లింగాకర్షక బుట్లను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఏవో పి.వెంకట నర్సయ్య మాట్లాడుతూ ఈ పురుగు ఉనికిని రైతులు ఎప్పటికప్పుడు గమనించాలని తెలిపారు. గ్రామ వ్యవసాయ సహాయకులు టి.తిరుమల, రైతులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు, చట్టాలపై అవగాహన

క్రోసూరు: మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం, కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలల హక్కులు, చట్టాలు, బాల్యవివాహాలు, పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ వి.మాధవి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీపీ పి.కోటయ్య, గౌరవ అతిథులుగా పంచాయతీ విస్తరణాధికారి జి.శ్రీనివాసరావు, ఎంఈవో–2 గణేష్ పాల్గొన్నారు. వన్ స్టాప్ సెంటర్ కో ఆర్డినేటర్ సీహెచ్ సుప్రజ మాట్లాడుతూ కుటుంబాలలో చిన్న చిన్న గొడవలు జరిగి విడాకుల వరకు వెళ్తున్న నేటి పరిస్థితుల్లో బాధ్యులు వన్ స్టాప్ సెంటర్‌ను సంప్రదించగలితే కౌన్సెలింగ్ ద్వారా పరిష్కరించవచ్చన్నారు. మిషన్ వాత్సల్య, బాల్య వివాహాలు, దత్తత తదితర అంశాలపై జిల్లా ప్రొటెక్షన్ యూనిట్ లీగల్ ప్రొహిబిషన్ అధికారి జె.ప్రశాంతి అవగాహన కల్పించారు. ఎంఈవో మాట్లాడుతూ ఆడపిల్లల చదువుల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని అన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో బాలికలపై జరుగుతున్న వేధింపుల పట్ల ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. అనంతరం బాలల హక్కులు, చట్టాల గురించి తెలియజేసే పుస్తకాలను పంపిణీ చేశారు. సెక్టార్ సూపర్‌వైజర్లు మహిళా పోలీసులు, సెక్రటరీలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, సీహెచ్‌వో, కేజీబీవీ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఇందిరాప్రియదర్శిని, ఉపాధ్యాయులు, బాలికలు పాల్గొన్నారు.

కూటమి ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు ఉద్యమిస్తాం

- సీపీఎం జిల్లా కార్యదర్శి అనుముల లక్ష్మీశ్వరరెడ్డి



మాట్లాడుతున్న లక్ష్మీశ్వరరెడ్డి

దొడ్లేరు(క్రోసూరు): అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలపై భారాలు వేస్తుందని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అనుముల లక్ష్మీశ్వరరెడ్డి అన్నారు. సీపీఎం క్రోసూరు మండల మహాసభ దొడ్లేరు గ్రామంలోని షాదీఖానాలో సీపీఎం మండల నాయకులు ముత్యాల పోలు అధ్యక్షతన జరిగింది. లక్ష్మీశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సీఎం చంద్రబాబు నాయుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కరెంట్ చార్జీల భారంపై 'బాదుడే బాదుడు' కార్యక్రమాన్ని చేపట్టి ప్రజల్ని రెచ్చగొట్టి అధికారంలోకి వచ్చిన తరువాత ట్రూ అప్ చార్జీల పేరుతో కోట్ల రూపాయలు వసూలు చేయాలని చూస్తున్నారని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి బిగిస్తే పగలగొట్టండి అని పిలుపునిచ్చిన బాబు కూటమి ఈ రోజు కేంద్ర ప్రభుత్వ ఒత్తిడికి తలొగ్గి స్మార్ట్ మీటర్లు బిగించడానికి సిద్ధమయ్యారని అన్నారు. రాష్ట్రానికి తలమానికంగా ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం అమ్ముతామని చెబుతుంటే ఎందుకు నోరు మెదపటం లేదని ప్రశ్నించారు. మోదీ తన అజెండా అయిన కార్పొరేట్ మత రాజకీయాలను అమలు చేయడంలో వెనకడుగు వేయడం లేదని దేశభక్తులు, ప్రజాస్వామ్య వాదులు ఈ విధానాలను వ్యతిరేకించాలని కోరారు. గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు శాఖ మహాసభలు జరుగుతున్నాయని ఈ మహాసభల్లో చర్చించిన విషయాలపై ప్రజలను సమీకరించడానికి జరిగే ఆందోళన పోరాటాల్లో ప్రజలు కలిసి రావాలని కోరారు. సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

నకరికల్లు: అపరిమితంగా పెంచిన నిత్యావసరాల ధరలను సత్వరమే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రజాపోరు ప్రచార యాత్ర కార్యక్రమాన్ని స్థానిక వై జంక్షన్ నుంచి మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 14న స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనపై నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సీపీఎం మండల కార్యదర్శి జి.పిచ్చారావు, ఈవూరి లక్ష్మారెడ్డి, ఈవూరి అప్పిరెడ్డి, గోవిందునాయక్, చట్టు కోటేశ్వరరావు, ఆవుల వెంకటేశ్వర్లు, రామాంజినాయక్, కొండానాయక్ పాల్గొన్నారు.



నకరికల్లులోని వై జంక్షన్ వద్ద ప్రజాపోరు ప్రచార యాత్రలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు

సత్తెనపల్లి: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని, పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని సీపీఎం పట్టణ కమిటీ సభ్యుడు అనుముల వీరబ్రహ్మం అన్నారు. సీపీఎం రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా చేపట్టిన 'ప్రజాపోరు ప్రచార యాత్ర' మంగళవారం పట్టణంలోని రంగా కాలనీ, సుందరయ్య కాలనీ, 19వ వార్డు, మాష్టిన్ పేట, కొత్తపేటలలో జరిగింది. ఈ సందర్భంగా ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. వీరబ్రహ్మం మాట్లాడుతూ ఈ నెల 14న తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా కార్యక్రమంలో ప్రజానీకమంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం నాయకులు సుసులోన్, ప్రభాకర్, నాగేశ్వరరావు, లక్ష్మణ్‌రావు, రాజకుమార్, తాతారావు, రామయ్య, కాళీ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ఆఫ్‌లైన్ దరఖాస్తులను క్లియర్ చేయాలి

సత్తెనపల్లి ఆర్డీవో జీవీ రమాకాంతరెడ్డి



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల దరఖాస్తులపై సమీక్ష చేస్తున్న ఆర్డీవో జీవీ రమణకాంత్‌రెడ్డి

సత్తెనపల్లి: కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఆఫ్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను బుధవారం సాయంత్రానికి క్లియర్ (ఆన్‌లైన్) చేయాలని సత్తెనపల్లి ఆర్డీవో గాజులపల్లి వెంకట రమణకాంత్‌రెడ్డి అన్నారు. సాధారణ ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ వ్యాప్తంగా వచ్చిన దరఖాస్తులపై సమీక్ష చేశారు. సత్తెనపల్లి రూరల్ మండలం నుంచి ఆఫ్‌లైన్‌లో 676 దరఖాస్తులు, ఆన్‌లైన్‌లో 1,860 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి వివరించారు. వాటిని ఆయన పరిశీలించారు. ఆఫ్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులన్నిటినీ క్లియర్ చేయాలన్నారు. అక్కడి నుంచే డివిజన్ పరిధిలోని అన్ని మండలాల తహసీల్దార్లతో ఫోన్‌లో మాట్లాడి ఆదేశాలు జారీ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ ఎస్.రవి కుమార్, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ బోసు బాబు, సిబ్బంది ఉన్నారు.


ముప్పాళ్ళ: పెండింగ్ అర్జీలు లేకుండా పనిచేయాలని సత్తెనపల్లి ఆర్డీవో జీవీ రమణకాంత్‌రెడ్డి చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ఎమ్మెల్సీ అర్జీలపై తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలతో సమీక్ష నిర్వహించారు. అందిన అర్జీలు, విచారణపై ఆరా తీశారు. మండలంలోని పోలింగ్ కేంద్రాల వివరాలు, కేంద్రాల మార్పులపై అందిన అర్జీల పైనా రెవెన్యూ సిబ్బందితో చర్చించారు. తహసీల్దార్ ఎం.భవానీశంకర్, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, సర్వేయర్ సుధాకర్, ఆయా గ్రామాల వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకు ముడత నివారణపై అవగాహన

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామంలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా రైతులకు ఆకు ముడత నివారణ చర్యలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వరి సాగులో రోప్ పుల్లింగ్ విధానంతో ఆకు ముడత పురుగులను కొంత మేర నివారించవచ్చని రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

మొక్కజొన్నలో విత్తన శుద్ధి చేపట్టాలి

ఏవో అరుణ



చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): మొక్కజొన్న సాగు చేసే రైతులు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ చెప్పారు. మండలంలోని చాగంటివారిపాలెం, లంకెలకూరపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం జరిగింది. మొక్కజొన్న, శనగ సాగు చేసే రైతులు విత్తన ఎంపిక విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. మొక్కజొన్న విత్తన శుద్ధికి సైంట్రానిలిప్రోల్ లేదా థియోమెథాక్సైమ్ 6 ఎంఎల్ ఎకరానికి కలిపి నాటుకోవాలన్నారు. కత్తెర పురుగు పరిశీలనకు ఎకరానికి 5 లింగాకర్షక బుట్టలు పెట్టడం ద్వారా ఉధృతి తగ్గించవచ్చన్నారు. జీవన ఎరువులు అయిన పీఎఎం, కేఆర్‌బీ, పీఎస్‌బీ ఉపయోగించడం ద్వారా మందు కట్టల వాడకం 40 శాతం తగ్గించవచ్చన్నారు. నేలలో సేంద్రియ కర్బనం పెంచుకోవడం ద్వారా గ్లోబల్ వార్మింగ్ నష్టాలను తగ్గించుకోవచ్చన్నారు. మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ, ఏఈవో శైలజ, ఎంఎస్‌కేఎం సుభాని, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.